# క్రైమ్ కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 87 గుంటూరు, ఆదివారం 07 - 12 - 2025 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైమ్ కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.



సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## మోదీ శక్తివంతమైన ప్రసంగం



**న్యూఢిల్లీ: డిసెంబర్ 06 క్రైమ్ కౌంటర్ న్యూస్):** భారతదేశం ఇతర దేశాలతో పోలిస్తే మెరుగైన స్థితిలో ఉందని, ప్రపంచంలోని సవాళ్ల మధ్య భారతదేశం వేరే లీగ్‌లో కనిపిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీఅన్నారు. శనివారంనా డిక్కడ జరిగిన 23వ హిందు స్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్-2025 లో ప్రధాని శక్తివంతమైన కీలకోపన్యాసం చేశారు. భారతదేశ వృద్ధి రేటు నుంచి మహిళా సాధికారత వరకూ పలు అంశాలను ప్రధాని తన ప్రసంగంలో ప్రస్తావించారు. భారతదేశం సాధిస్తున్న వృద్ధిని ప్రధాని హైలైట్ చేస్తూ, 'నేషన్ ఫస్ట్ పాలసీ' కి అనుగుణంగానే ఇవాళ్టి సంస్కరణలన్నీ ముందుకు సాగుతున్నా యని చెప్పారు. అనిశ్చితి ప్రపంచంలో సంస్కరణల ఆధారిత ఆర్థిక ఎజెండా కారణంగా పురోగతికి ఒక ప్రకాశవంతమైన ఉదాహరణగా భారత్ నిలుస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మందగమనం నెలకొన్న తరుణంలో భారత్ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా ముందుకు వెళ్తోంద న్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని రెండో త్రైమాసికంలో 8.2 శాతం వృద్ధి రేటు నమోదయ్యిందని గుర్తు చేశారు. ఇది ప్రపంచ ఆర్థిక వృద్ధిలో భారత్ చోదక శక్తిని నిరూపిస్తోం దన్నారు. ఇది కేవలం నంబర్ మాత్రమే కాదని, మన బలమైన స్థూల ఆర్థిక వ్యవస్థకు సూచిక అని తెలిపారు. గరిష్ఠ వృద్ధి, కనిష్ఠ ద్రవ్యోల్బణానికి ఇండియా మోడల్‌గా నిలుస్తోందని చెప్పారు. భారతదేశ అభివృద్ధిలో నారీ శక్తి పాత్ర ప్రశంసనీయమని మోదీ అన్నారు. ప్రతి రంగంలోనూ మన ఆడకూతుళ్లు తమదైన ముద్రవేసుకుంటున్నారని, ఆటంకాలు తొల గించుకుంటూ ముందుకు వెళ్తున్నారని, గగన తలంలోనూ తమ శక్తిసామర్థ్యాలను చాటు కుంటున్నారని ప్రశంసించారు. మూడు రోజుల సమ్మిట్‌లో భాగంగా ప్రధాని ముగింపు ఉపన్యాసం చేశారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారా మన్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, నటులు హుగ్ గ్రాంట్, అమీర్ ఖాన్ తదితర ప్రముఖులు చివరిరోజు సమ్మిట్‌లో పాల్గొన్నారు.

## శ్రీవారి భక్తుల మనోభావాలు

# దెబ్బతీస్తున్నావ్...



**అమరావతి, డిసెంబర్ 06 క్రైమ్ కౌంటర్ న్యూస్):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు ఉన్నాయని ఫైర్ అయ్యారు. ఇవాళ(శనివారం) అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి సీఎం చంద్రబాబు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో పలు కీలక అంశాలపై మాట్లాడారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ముఖ్యమంత్రి చిట్‌చాట్ చేశారు. శ్రీవారి పరకామణి దొంగతనం వ్యవహారంపై జగన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు మీడియా ప్రతినిధులు. పరకామణి దొంగతనం చిన్న దొంగతనం అంటూ జగన్ వ్యాఖ్యలు అందరినీ విస్తుగొలిపాయని చెప్పుకొచ్చారు. జగన్‌కు దేవుడన్నా లెక్కలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలన్నా లెక్కలేదని... ఆలయాలు పవిత్రత అన్నా లెక్కలేదని ధ్వజమెత్తారు.

**ఇంతకంటే ఘోరం ఉంటుందా..?**

'జగన్ తన బాబాయి వివేకా హత్యనే సెటిల్ చేసుకుందామని చూశారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల పరకామణి చోరీని కూడా సెటిల్ చేయాలని చూశారు.. ఇంతకంటే ఘోరం ఉంటుందా? దొంగతనాన్ని కూడా తప్పు కాదని చెప్పే వాళ్లను ఏమనాలి.? సెంటిమెంట్ విషయాల్లో కూడా సెటిల్‌మెంట్ అంటూ వ్యాఖ్యాలా.? దొంగతనం చేసిన వ్యక్తి డబ్బులు తిరిగి కట్టాడు కదా...తప్పేముందని జగన్ అత్యంత అనైతికంగా వాదిస్తున్నారు. భక్తులు, ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. శ్రీవారి ఆలయంలో ప్రతి అంశంలోనూ భక్తుల

2లో

## కరెంట్ షాక్‌తో తల్లిని,,



**డిసెంబర్ 06 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఐదో తరగతి చదివే బాలుడు.. మహా అయితే పది, పన్నెండేళ్లు ఉండొచ్చు.. ఆడుతూ పాడుతూ తిరిగే వయసు.. ఏదైనా ప్రమాదం ఉందని తెలిస్తే పరుగులు తీసే వయసు. కానీ అత్యవసర పరిస్థితి తలెత్తితే ఆ పిల్లాడు భయపడలేదు. అదరలేదు, బెదరలేదు.. కన్న తల్లి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే.. సమయస్ఫూర్తితో వ్యవహరించాడు. అమ్మను కాపాడుకున్నాడు.. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిసెంబర్ 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. మెగా

2లో

## ఏపీలో సినిమా, సీరియల్స్, ఓటీటీ షూటింగ్స్




**అమరావతి, డిసెంబర్ 06 క్రైమ్ కౌంటర్ న్యూస్):** గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెంచే విషయంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టి సారించారు. అందులో భాగంగా అల్లూరి జిల్లా అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పలు సూచనలు చేశారు. గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచేలా అధికారులు పనిచేయాలని.. వారి ఆదాయ మార్గాలు పెంచాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలని స్పష్టం చేశారు. అటవీ ఉత్పత్తుల తయారీతో పాటుగా.. వాటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎకో టూరిజం, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం వంటి కీలకమైన అంశాల ద్వారా గిరిజన యువతలో నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలని సూచించారు.

ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని.. గిరిజనుల శక్తిని, శ్రమను ఉపయోగించుకొని వారి జీవన ప్రమాణాలను పెంచాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ప్రస్తుతం అటవీ ఉత్పత్తులు, ఆర్గానిక్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని.. కాఫీ తోటలతోపాటు అడవిలో విరివిగా దొరికే ఉత్పత్తులను సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. గిరిజనులలో నూతన ఉత్తేజం నింపేలా కొత్త కార్యక్రమాలు చేపట్టాలని.. గిరిజనుల ఆదాయం పెంచడంతో పాటుగా వారికి అన్ని సదుపాయాలు, సౌకర్యాలు అందాలని స్పష్టం చేశారు. మరోవైపు ఏజెన్సీ ప్రాంతం ఉద్యానవన పంటలకు అనువైనదని.. దీనిని ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తున్నాయని పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ నేపథ్యంలో వివిధ రకాల పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ పంటలతో పాటుగా ఇక్కడి వాతావరణానికి అనువైన పంటలను కూడా పండించేలా చూడా లని ఆదేశించారు. అలాగే ఏజెన్సీ ప్రాంతంలోఎకో టూరిజం ప్రోత్సహించాలని పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. సహజమైన ప్రకృతి సంపదకు నష్టం వాటిల్లకుండా ఎకో టూరిజం పెంచే అవకాశాలపై దృష్టి సారించాలని సూచించారు.

2లో


## ఎమ్మెల్యేల పనితీరు మెరుగుపడింది..

# సీఎం చంద్రబాబు కితాబు



**అమరావతి, డిసెంబర్ 06 క్రైమ్ కౌంటర్ న్యూస్):** పలు కీలక సమీక్షలు, వన్ టు వన్ భేటీల ద్వారా దాదాపు అందరి ఎమ్మెల్యేల పనితీరు మెరుగుపడిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. మరో 37మంది ఎమ్మెల్యేల పనితీరు మరింత మెరుగుపడాల్సి ఉందని తెలిపారు. ఇవాళ (శనివారం) అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో అందుబాటులో ఉన్న నేతలతో చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రతీ ఒక్కరి పనితీరుపైనా నాలుగైదు మార్గాల్లో కచ్చితమైన సర్వే నివేదికలు తెప్పించుకుంటున్నానని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. ఆర్ఎస్ఎస్ ఎలాంటి పదవులూ ఆలోచించకుండా బీజేపీకి నిస్వార్థంగా పనిచేస్తోందని ప్రస్తావించారు. అదే తరహాలో మన ఐడియాలజీ ప్రకారం పార్టీ కేడర్‌ను సిద్ధం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. స్కూల్ ఇన్నోవేటివ్ పార్టనర్‌షిప్ సమ్మిట్ పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడదామని సూచించారు సీఎం చంద్రబాబు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిద్దామని తెలిపారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడు గంటలపాటు మీడియా సమావేశం పెట్టిన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువచ్చారు నేతలు. నెలకోసారి వచ్చి విజ్ఞత కోల్పోయి మాట్లాడేవారి మాటలకు విలువ లేదని ఎద్దేవా చేశారు. ప్రజలే వారికి బుద్ధి చెబుతారని తెలిపారు. జగన్ మాట్లాడే అర్థం పర్థం లేని మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## నేటి నుంచి లోకేశ్ విదేశీ టూర్




**అమరావతి, డిసెంబర్ 06 క్రైమ్ కౌంటర్ న్యూస్):** రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా విద్య, ఐటీశాఖ మంత్రి లోకేశ్ అమెరికా, కెనడా దేశాల్లో పర్యటించనున్నారు. శనివారం నుంచి ఐదు రోజులపాటు ఆయన పర్యటన సాగనుంది. 6వ తేదీన డల్లాస్‌లో నిర్వహించే తెలుగు డయాస్పోరా సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. 8, 9 తేదీల్లో శాన్‌ఫ్రాన్సిస్కో వేదికగా పలు కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతారు. 10న కెనడాలోని టొరంటోలో పర్యటిస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేశ్ అమెరికాలో పర్యటించడం ఇది రెండో సారి. పెట్టుబడుల సాధన కోసం గత 18 నెలల్లో ఆయన అమెరికా, స్విట్జర్లాండ్ (దావోస్), సింగపూర్, ఆస్ట్రేలియా దేశాల్లో పర్యటించారు.

## ఎంపీలు రబ్బర్ స్టాంపులు:



రాష్ట్ర ఎంపీలపై పీసీసీ చీఫ్ షర్మిల తీవ్ర ఆగ్రహం చేశారు. పార్లమెంటులో రాష్ట్ర హక్కుల గురించి కనీసం మాట్లాడటం లేదని విమర్శించారు. ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి, ప్రధాని మోదీ మెప్పు కోసం పనిచేస్తున్నారన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఎంపీలు మోదీకి రబ్బర్ స్టాంపుల్లా మారారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు గడిచినా, విభజన హామీలు ఇప్పటికీ నెరవేరలేదని, ఇప్పటికైనా నోరు విప్పాలని సూచించారు.

## చాన్స్ వస్తే చంద్రబాబు బయోపిక్‌లో నటిస్తా



**ఇంద్రకీలాద్రి, డిసెంబర్ 06 క్రైమ్ కౌంటర్ న్యూస్):** అవకాశం వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు బయోపిక్‌లో నటిస్తానని కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్ అన్నారు. మంచి దర్శకుడు ముందుకు వస్తే ఆ క్యారెక్టర్‌లో నటించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. శుక్రవారం ఆయన కుటుంబసభ్యులతో కలసి విజయవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగ తం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా శివరాజ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య బయోపిక్‌లో నటిస్తున్నానని, విలువలతో కూడిన రాజకీయ నేత జీవిత కథలో నటించడం గర్వంగా ఉందని అన్నారు. రాంచరణ్ నటిస్తున్న పెద్ది చిత్రంలో మంచి పాత్రలో నటిస్తున్నట్టు చెప్పారు.

# శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు..

సెంటిమెంట్ ముడిపడి ఉంటుంది.అలాంటి సున్నిత అంశాలను కూడా సెటిల్‌చేశామని తేలికగా జగన్ మాట్లాడుతున్నారు. భక్తుల ఇచ్చిన కానుకలు, ముడుపులను కొట్టేసిన దొంగలతో సెటిల్‌మెంట్ ఏంటి? శ్రీవారి హుండీలో చోరీపై జగన్ చేసిన వ్యాఖ్యలపై అన్నివర్గాల ప్రజల్లోనూ తీవ్ర ఆవేదన కనిపిస్తోంది. వర్గాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా ఆ వ్యాఖ్యలను తప్పుపడుతున్నారు. రూ.72 వేలు అనేది చిన్న దొంగతనమని చెబుతున్నాడు. దేవుడు హుండీలో చోరీ చిన్న తప్పా? దాన్ని సెటిల్ చేయడం మహాపాపం కాదా? కోట్ల మంది భక్తుల విశ్వాసాలు దెబ్బతీసేలా పరకామణి విషయంలో జగన్ ఇలాంటి వ్యాఖ్యలు ఘోర పాపం కాదా' అని సీఎం చంద్రబాబు ప్రశ్నల వర్షం కురిపించారు.

# కరెంట్ షాక్‌తో తల్లిని,,

పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల చదువులకు సంబంధించిన వివరాలను ఉపాధ్యాయులు.. తల్లిదండ్రులకు వివరించారు.ఈ క్రమంలోనే పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం జొన్నలగరువు గ్రామంలోనే పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. జొన్నలగరువు ప్రభుత్వ పాఠశాలలో దీక్షిత్ అనే చిన్నారి ఐదో తరగతి చదువుతున్నాడు. అయితే దీక్షిత్ వాళ్లమ్మ పేరెంట్ టీచర్ మీటింగ్‌కు రాలేదు. దీంతో తల్లి ఎందుకు ఇంకా మీటింగ్ రాలేదంటూ దీక్షిత్ స్కూల్ నుంచి ఇంటికి వెళ్లి చూశాడు. అప్పుడే వాళ్లమ్మ కరెంట్ షాక్ తగిలి కొట్టుమిట్టాడుతున్న విషయం చూశాడు. అయితే ఈ ఘటన చూసిన దీక్షిత్.. భయపడిపోలేదు. సమయస్ఫూర్తితో వ్యవహరించాడు.
భయంతో ఇరుగు పొరుగు వారిని పిలుచుకుని వచ్చేంత సమయం లేదని దీక్షిత్ గ్రహించాడు. తెలివిగా ఆలోచించి.. కరెంట్ షాక్ కొట్టడానికి కారణమైన మోటార్ స్విచ్ ఆఫ్ చేశాడు. ఆ తర్వాత తల్లిపై పడిన కరెంట్ తీగను కర్ర సాయంతో తొలగించి తల్లి ప్రాణాలను కాపాడాడు. అనంతరం తల్లిని వెంటబెట్టుకుని ఆస్పత్రికి వెళ్లారు. డాక్టర్లు ఆమెకు ప్రథమ చికిత్స అందించడంతో ఆమె కోలుకుంది. అనంతరం తల్లితో కలిసి దీక్షిత్ స్కూల్లో జరిగిన పేరెంట్ టీచర్ మీటింగ్‌కు హాజరయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, ఉపాధ్యాయులు దీక్షిత్ సమయస్ఫూర్తిని మెచ్చుకున్నారు. దీక్షిత్ చాకచక్యంగా వ్యవహరించి తన తల్లికి పునర్జన్మ ఇచ్చాడని ప్రశంసిస్తున్నారు,

# ఏపీలో సినిమా, సీరియల్స్, ఓటీటీ షూటింగ్స్

వీటితో పాటుగా సినిమాలు, సీరియల్స్, ఓటీటీలో వచ్చే వివిధ రకాల కంటెంట్లను ఏజెన్సీ ప్రాంతాల్లో షూటింగ్ చేసుకునేలా ప్రోత్సహించాలని పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. దీని వల్ల గిరిజనులకు ఆదాయం పెరగడంతో పాటు గిరిజన యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి, వారి జీవన ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ.. నెలవారీ రిపోర్టులతో ముందుకెళ్దామని పవన్ కళ్యాణ్ అన్నారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు.

# బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం




**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు అమరావతి న్యూస్ :** దిడుగు గ్రామంలోని ఎం పి యు పి పాఠశాలలో గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కులు మరియు రక్షణ పై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత ప్రాజెక్టు కోఆర్డినేటరూ విమల వహించారు. రిసోర్స్ పర్సన్ గా సంస్థ సిబ్బంది దిలీప్ కుమారు విచ్చేసి మాట్లాడుతూ బాలల సంపూర్ణ వికాసం కోసం ఉపాధ్యాయులు కుటుంబం సమాజం కలిసి పనిచేయాల్సిన అవసరంఉందన్నారు . పిల్లల ప్రాథమిక హక్కులను కాపాడుదాం. బాలల రక్షణ సంరక్షణ చట్టాల గురించి వివరించారు.సిస్టర్ డియానా, గిడుగు గ్రామాన్ని డ్రాప్ అవుట్ లేకుండా ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పాఠశాలకు రాని డ్రాప్అవుట్ పిల్లలను ఎలా ప్రోత్సహించాలి వంటి విషయాలపై సమగ్రంగా వివరించారు. కుటుంబం, సమాజం, పాఠశాల స్థాయిల్లో పిల్లల హక్కుల పరిరక్షణలో తీసుకోవాల్సిన చర్యలను ఉపాధ్యాయులకు తెలియజేశారు.ఉపాధ్యాయులకు గ్రూప్ డిస్కషన్ నిర్వహించారు. అనంతరం బాలల హక్కులపై ఉపాధ్యాయులకు ప్రీ టెస్ట్ పోస్ట్ టెస్ట్ నిర్వహించి, ఉపాధ్యాయుల్లో అవగాహనను మరింతగా పెంపొందించారు.పిల్లల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల జోస్పిన్ . ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సంస్థ సిబ్బంది త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆలోచనా విధానం ప్రతిపల్లెకు చేరాలి.

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోదా జాన్ పాల్.
విగ్రహాల ఏర్పాటుతో పాటు అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం.
మాజీ ఎంపీపీ పచ్చల నాగేశ్వరరావు.
అంబేద్కర్ కలలు కన్న సమాజం కోసం కృషి చేయాలి.
జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు పెద్దింటి పొలేష్.





**ముప్పాళ్ల, డిసెంబర్ 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** దేశ దార్శనికుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానం పల్లె పల్లెకు చేరాలని, ఆయన సిద్ధాంతాల అమలకు యువత ముందుకు రావాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్ పాల్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద జై భీమ్..జై జీవన్ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని పౌండేషన్ చైర్మన్ కందుల సుబ్బారావు (జార్జ్), ప్రధాన కార్యదర్శి రుద్రపాటి రామకృష్ణ లు నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా గోదా జాన్ పాల్ మాట్లాడుతూ..మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత బి ఆర్ అంబేద్కర్, భారత రాష్ట్ర ఉప ప్రధాని జగజ్జీవన్ రామ్ ల విగ్రహాల ఏర్పాటు అభినందనీయమన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ స్ఫూర్తి కొనసాగాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వమే విగ్రహాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వ ఖర్చులతో అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా జరిగేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు.
మాజీ ఎంపీపీ పచ్చల నాగేశ్వరరావు మాట్లాడుతూ దళిత సామాజిక వర్గాలు రాజ్యాధికారం వైపు అడుగులేసేందుకు విద్య అనే ఆయుధాన్ని ఉపయోగించు కోవాలన్నారు. విద్య ఉద్యోగాల కోసం మాత్రమే కాదని విజ్ఞానం, చైతన్యం, విముక్తి,సమానత్వాన్ని అందిస్తుందన్నారు. జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు పెద్దింటి పొలేష్ మాట్లాడుతూ డా బి ఆర్ అంబేద్కర్ ని ఒక పదంలో నిర్వచించలేమని,న్యాయవాదిగా,ఆర్థికవేత్తగా,సామాజిక, సంఘ సంస్కర్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. జయంతి, వర్ధంతి లో పూలదండలు, నినాదాలతో కాకుండా తమ జీవన విధానంలో ప్రతి రోజు నివాళులు అర్పించాలన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఉన్నతంగా ఉండాలని..సమాన హక్కులు,సమాన అవకాశాలు పొందాలని అంబేద్కర్ ఆకాంక్షించారన్నారు. సమాజంలో ఎంత కాలం జీవించామనేది కాదని,ఎంత ఉన్నతంగా జీవించామనేది ముఖ్యం అన్నారు. అలాంటి సమాజాన్ని అంబేద్కర్ కోరుకున్నారని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలన్నారు.అప్పుడే అంబేద్కర్ కలలు కన్న సమాజం నిర్మితమవుతోందన్నారు.అనంతరం పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ళ మండల తెలుగు యువత అధ్యక్షుడు నామ్ శ్రీకాంత్ నాయుడు, ముప్పాళ్ల మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నాము పరమేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మధిర రామ్మోహన్ రెడ్డి, చాగంటివారిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి బీసీ నాయకుడు రామలింగయ్య, మాల మహానాడు ముప్పాళ్ళ మండల అధ్యక్షులు శావ చందు, ముప్పాళ్ళ మండల ఎస్ సి సెల్ కార్యదర్శి నెలటూరి బాలకృష్ణ,మాల మహానాడు యూత్ రుద్రపాటి చంద్రశేఖర్, ఎంఆర్పీఎస్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జర్లపూడి అశోక్, ఎంఆర్పీఎస్ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్చార్జి పలుకూరి రామారావు, ముప్పాళ్ళ మాజీ సర్పంచ్ చెల్లి ముసలయ్య, ముప్పాళ్ళ మండలం మాజీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నెల్లటూరి సుధాకర్, ముప్పాళ్ళ తెలుగుదేశం పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి గద్దల ఏసుదాసు,చిలకా జకరయ్య, కందుల లాబాను, కందుల నాగార్జున, కందుల శ్రీకాంత్, ముప్పాళ్ళ మండల ఎస్సీ సెల్ మాజీ కార్యదర్శి గర్నెపూడి బోసు,బొల్లవరం మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు చింతపల్లి శ్రీను, సప్పర వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ బాబు, గద్దల రామయ్య, గాడి కొయ్య వజ్రాయుధం,గద్దల ఇస్సాకు, గద్దల ఏసోబు తదితరులు పాల్గోని ఘనంగా నివాళులు అర్పించారు.

# పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎల్జేపీ జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్ కుమార్.

*అంబేడ్కర్ వర్ధంతి, సావిత్రి జయంతి, బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారం పలు కార్యక్రమాల్లో....*

లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ శనివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రధానంగా ప్రపంచ మేధావి,రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 69 వర్ధంతి సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. అనంతరం సత్తెనపల్లి బార్ అసోసియేషన్ లో జరిగిన అంబేడ్కర్ వర్ధంతిలో పాల్గొన్నారు. అదేవిధంగా మహానటి సావిత్రి 90 వ జయంతి లో ఆయన పాల్గొని ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు నవరసాలను అలవోకగా పండిస్తూఏ పాత్రలోనైనా జీవిస్తూ, కళ్లతోనే ఆహావభావాలను పలికించిన సావిత్రి తెలుగు చిత్రసీమే కాదు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్నా బార్ కౌన్సిల్ ఎన్నికల్లో గుంటూరుకు చెందిన సీనియర్ న్యాయవాది కె.వి.కె. సురేష్ పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా సత్తెనపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది చలవాది చిన్నసత్య నారాయణ కార్యాలయంలో జరిగిన న్యాయవాదుల గెట్ టు గెదర్ జొన్నలగడ్డ పాల్గొని సురేష్ కు మద్దతు తెలిపారు.




# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు నివాళి అర్పించిన క్రోసూరు తెదేపా నాయకులు





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు కోసూరు న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి పురస్కరించుకొని క్రోసూరు మండల టిడిపి నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కాంద్రు కాశయ్య మన్నేం శ్రీనివాస రావు నలజాల కోటేశ్వరరావు డాక్టర్ షరీఫ్ మండల పార్టీ మొగల్ జాను దోమచెర్ల కాశయ్య కొమ్మినేని సతీష్ బండారు మైసూర్ బాబు దుద్దుల యోహాను పార్టీ అధ్యక్షులు చిలకా రవి పార్టీ మన్నెం చంటి అసన్ కొండలు చిలకా మరియదాసు హనుమంతరావు పోదుగంటి లక్ష్మయ్య సమీ తదితరులు పాల్గొన్నారు

## రూ.60 లక్షలతో నూతనంగా సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన.



క్రైమ్ కౌంటర్ న్యూస్ దుర్గి.పులిమెల మాణిక్యం. పల్నాడు జిల్లా,దుర్గి మండల కేంద్రమైన మౌలిక వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వం రాజీ పడబోదని మాచర్ల శాసనసభ సభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి తెలిపారు.మండల కేంద్రమైన దుర్గిలో రూ .60లక్షలతో నూతనంగా నిర్మించునున్న 4 సీసీ రోడ్లు,డ్రైనుల్లుకు భూమిపూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏచూరి సునీత సాయి శంకర్,లింగా రమేష్, లింగా బ్రహ్మయ్య, దొండపాడు చెన్నయ్య, గర్ని రమేష్,యాగంటి నరేష్,సింగ్ నాగేశ్వరరావు,రుద్రాల రవి,కోట వీరయ్య చౌదరి,ఎంపీడీవో సుగుణ, పంచాయతీరాజ్ ఏఈ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి ఘనమైన నివాళులు



క్రైమ్ కౌంటర్ న్యూస్ : కొలిమిగుండ్ల నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాల గ్రామంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల సమీపంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 69 వ వర్ధంతిని ఏపీ ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎం నాగరాజు మరియు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాదిగ నాగేంద్ర మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్. కంబగిరి స్వామి మాదిగ గారు పాల్గొన్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల పెన్నిది బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ భీమ్రావు అంబేద్కర్ గారు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతకై అందరికీ స్వేచ్ఛ సమానత్వం ఉండాలని భారత రాజ్యాంగాన్ని రూపొందించారని ప్రపంచ మేధావి అయినటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి వర్ధంతి సందర్భంగా కొద్దిసేపు మౌనం పాటించి ఆయనకు ఘన నివాళి అర్పించారు కార్యక్రమంలో ఎంఎస్ఎస్ అధ్యక్షులు మంగలి కంబగిరి స్వామి ఎంఎస్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చంటి బనగానపల్లె నియోజకవర్గం యువ నాయకులు ఎం .నాగ శివ శివరామరాజు పాల్గొన్నారు

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. కు అశ్రునివాళ్లు ...



క్రోసూరు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గము క్రోసూరు మండలం క్రోసూరులో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు పోలమాలలువేసి ఘనంగా నివాళులు అర్థించిన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర హోనర్బుల్ చైర్మన్ "సేవారత్న"గార్లపాటి దాసు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. భారత స్వతంత్ర సమరయోధుడు. రాజ్యాంగ నిర్మాత. దళిత బలహీన వర్గాల వికాసానికి పాటుపడిన మహానేత. ప్రపంచంలో కూడా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలు ఎన్నో ఉన్నవి. చైనా దేశంలో కూడా ప్రపంచంలోకెల్లా అతి భారీ విగ్రహం నిర్మిస్తున్నారు. అందుకే అంబేద్కర్ను ప్రపంచ మేధావి అని కూడా అంటారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 69వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో విస్తీర్ణ అధికారి శిఖ శ్యాం సన్. ఎమ్మార్పీఎస్ పెదకూరపాడు నియోజకవర్గ నాయకులు వేమవరపు జీవన్ మాదిగ. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నందిగాం దేవదాసు మాదిగ పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డే నిర్వహించిన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్





క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు తాడికొండ నియోజకవర్గం : గుంటూరు జెకెసి కాలేజ్ రోడ్డులో ఉన్న తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించిన గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ ,పలువురి అర్జీదారుల సమస్యలపై అక్కడిక్కడే అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కారం చేసారు..

## తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అబివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వండి

### : జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

**తుడా పరిధిలోని గ్రామాల అభివృద్ధి పనులకు ప్రాధాన్యత తుడా చైర్మన్ సి.దివాకర్ రెడ్డి.**

**తుడా అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేద్దాం: ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ తుడా ఉపాధ్యక్షురాలు ఎన్.మౌర్య**





క్రైమ్ కౌంటర్ ప్రతినిధి:::కె రాఘవతిరుపతి, డిసెంబర్ 6 : తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ పరిధిలో అబివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. తుడా కార్యాలయం లో శనివారం నిర్వహించిన తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ రెండవ బోర్డు సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, చైర్మన్ తుడా చైర్మన్ సి.దివాకర్ రెడ్డి, ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య, ఏం.ఏ. అండ్ యుడి ఓ.ఎస్.డి.వెంకట సుబ్బయ్య, ఆర్.డి. శ్రీనివాసులు పాల్గొని అజెండాలోని పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ పరిధిలో అబివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ బోర్డు సమావేశంలో శెట్టిపల్లి టౌన్షిప్ ఏర్పాటు చేయనున్న ప్రాంతం చదును, శుభ్రం చేసేందుకు టెండర్ పిలవాలని, పెరుమాళ్ళపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని లోని ఏడు గ్రామాలకు గ్యాస్ ఆధారిత స్మశాన వాటిక, కర్మ క్రియల షెడ్డు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలపడం జరిగింది. ఉప్పరపల్లి నుండి మహిళా విశ్వవిద్యాలయం వరకు నాలుగు లైన్ల రోడ్డుకు మరియు మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. రేణిగుంట మండలం సూరప్ప కసం వద్ద తుడా పరిధిలో ఏర్పాటు చేసిన పద్మావతినగర్ లే అవుట్ లో మౌళిక వసతుల కల్పనకు ఆమోదం తెలిపారు.

తుడా చైర్మన్ మాట్లాడుతూ.. తుడా పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు.

ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, తుడా ఉపాధ్యక్షురాలు మాట్లాడుతూ. తుడా నిధులు దుర్వినియోగం కాకుండా అన్ని అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు అందరూ కృషి చేయాలని తెలిపారు.

ఈ బోర్డు సమావేశంలో తుడా సెక్రటరి శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఈ. ఈ. రవీంద్ర, సిపిఓ దేవికుమారి, తదితరులు పాల్గొన్నారు.

డి ఐ పి ఆర్ ఓ, తిరుపతి

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్ మరియు సిడాప్

### గూడూరు (డి ఆర్ డబ్ల్యు డిగ్రీ కళాశాల) .



క్రైమ్ కౌంటర్ ప్రతినిధి:::కె రాఘవసంయుక్త ఆధ్వర్యంలో మరియు డి ఆర్ డబ్ల్యు డిగ్రీ కళాశాల , డాక్టర్ పాశం సునీల్ కుమార్ , శాసనసభ్యులు, గూడూరు నియోజకవర్గం వారి యొక్క సహాయ సహకారాలతో ఈరోజు జాబ్ మేళా నిర్వహించడం జరిగినది.గూడూరు నియోజకవర్గంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల నందు జరిగిన జాబ్ మేళా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా లి డాక్టర్ పాశం సునీల్ కుమార్ , గౌరవ శాసనసభ్యులు, గూడూరు నియోజకవర్గం వారు జాబ్ మేళా ను ప్రారంభించారు.నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో జాబ్ మేళా కార్యక్రమాన్ని ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్నాం : గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ గౌరవ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం తాము అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రభుత్వ, ప్రైవేటు పరంగా 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తెలిపారని అందులో భాగంగా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాల కల్పనలో భాగంగా మన గూడూరు నియోజకవర్గంలో ప్రతి మూడు నెలల కోసారి జాబ్ మేళాను నిర్వహించి వివిధ కంపెనీలలో ఉద్యోగాలను కల్పించడం జరుగుతోందని అన్నారు. గతంలో కూడా మన గూడూరు నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఇప్పటివరకు ఏడు మినీ జాబ్ మేళాలు మరియు రెండు మెగా జాబ్ మేళాలు నిర్వహించడం జరిగినది ఇందులో దాదాపు 1376 మంది యువతీ యువకులు జాబ్ మేళా లలో వివిధ కంపెనీలకు హాజరై దాదాపు 714 మంది బహుళ జాతీయ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొంది ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్నారని గౌరవ ఎమ్మెల్యే గారు యువతీ యువకులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ రోజు జరుగుతున్న జాబ్ మేళా నందు 15 కంపెనీలు పాల్గొన్నారని దీని ద్వారా 700 మందికి ఉపాధి కలగనున్నదని తెలిపారు. ఈ జాబ్ మేళా నందు 5 వ తరగతి నుండి ఎం.బి.ఎ వరకు చదువుకున్న వారికి వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు అవకాశం కల్పించడం జరుగుతుందని కావున జాబ్ మేళాలకు హాజరైన యువతీ యువకులు మీకు ఇష్టమైన కంపెనీకి ఇంటర్వ్యూ అటెండ్ అయ్యి వేతనంతో సంబంధం లేకుండా ఏదో ఒక కంపెనీలో ఉద్యోగంలో జాయిన్ అయి కుటుంబానికి ఆర్థికంగా తోడ్పడాలని తెలియజేశారు.ఇందులో భాగంగా గౌరవ ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ఎంపిక అయిన వారికి 13 వేల నుండి 25 వేల వరకు జీతం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. నిరుద్యోగ యువత ప్రతి మూడు నెలలకోసారి జరుగుతున్న జాబ్ మేళాలలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఈ జాబ్ మేళాలో సెలెక్ట్ అయిన యువతీ యువకులకు గౌరవ ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆఫర్ లెటర్స్ ఇవ్వడం తో పాటు గౌరవ ఎమ్మెల్యే గారు సెలెక్ట్ అయిన వారిని అభినందించడం జరిగినది. ఆర్. లోకనాథం, డిఎస్డివో, %ూజూంంఎఓ% , మాట్లాడుతూ.. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగం కల్పించే దిశగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ జాబ్ మేళాకి 15 బహుళ జాతీయ కంపెనీలు జాబ్ మేళాకు హాజరు అవ్వగా 394 మంది హాజరవుగా, 154 మంది వివిధ కంపెనీలకు సెలెక్ట్ అవడం జరిగినది మరియు 43 మంది షార్ట్ లిస్ట్ అవడం జరిగినది.గౌరవ ఎమ్మెల్యే చేతుల ఆదేశాలు ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా గత నెల ఆగస్టు-2025 జరిగిన జాబ్ మేళాలలో సెలెక్ట్ అయ్యి ప్రస్తుతం జాయిన్ అయిన వారిని ఈరోజు జరిగే జాబ్ మేళాకు ఆహ్వానించడం జరిగినది. యంగ్ మాన్ టెక్నాలజీస్, అపోలో ఫార్మసీ ,పేటీఎం, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఇన్సూరెన్స్ లో జాయిన్ అయినా వారు ఈ రోజు వచ్చి గౌరవ ఎమ్మెల్యే వారికి, ఫీడ్ బ్యాక్, సంతోషం వ్యక్తం చేయడం జరిగినది. అదేవిధంగా ఈరోజు హాజరైన యువతీ యువకులకు అవేర్నెస్ కల్పించడం జరిగినది. అలాగే యువత గౌరవ ఎమ్మెల్యే కి, ముఖ్యమంత్రి కి, డిప్యూటీ సీఎం గారికి, గౌరవ మినిస్టర్ స్కిల్ డెవలప్మెంట్, లోకేష్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.లోకనాథం ,జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ,తిరుపతి జిల్లా , శ్రీ హనుమంతరావు , ప్రిన్సిపాల్ డి ఆర్ డబ్ల్యు డిగ్రీ కళాశాల, శ్రీ మధుసూదన్ రావు , ఎంపీడీవో, పి శ్రీనివాసులు , పట్టణ అధ్యక్షులు, టిడిపి, చెంచు రామయ్య , టిడిపి లీడర్ , రహీం , మైనారిటీ లీడర్, టిడిపి మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు ఏపీ ఎస్ ఎస్ డి సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞతలతో

ఆర్ లోకనాథం,

జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, తిరుపతి జిల్లా.

Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at D.No: 465, Le Out No 2, Dodleru road, YSR Jagananna Colony, Krosuru, Guntur, Andhra Pradesh - 522410. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com